క్లుప్తంగా

స్పందన అర్జీదారులకు భోజన వసతి



నెల్లూరు రూరల్: నగరంలోని నెల్లూరు ఆర్డీఓ, అర్బన్ తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీదారులకు భారత్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి కల్పించారు. నగరంలోని హోటళ్ల నిర్వాహకుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. నెల్లూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నిర్మలానందబాబా చేతుల మీదుగా అర్జీదారులకు భోజనాన్ని అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు ఖాసీం, సుబ్బారెడ్డి, జనార్ధన్ పాల్గొన్నారు.

వార్డు ఎడ్యుకేషనల్ కార్యదర్శులతో సమీక్ష



నెల్లూరు(బారకాసు): విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయాల ఎడ్యుకేషనల్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులతో కాఫీ/టీ విత్ ఎంఈఓ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సమావేశంలో నిర్బంధ విద్య అమలు, స్కూల్ డ్రాపవుట్స్, ఆడుదాం ఆంధ్రా పోటీలు, కులగణన, పాఠశాలల్లోని సమస్యలు, నూతన ప్రణాళికా బడ్జెట్ తదితర అంశాలపై సమీక్షించారు. సచివాలయాల పరిధిలోని దివ్యాంగ విద్యార్థులను సీడబ్ల్యూఎస్ఎన్(చిల్డ్రన్ విత్ స్పెషల్ నీడ్)గా గుర్తించి పాఠశాలల్లో తప్పకుండా చేరిపించాలని సూచించారు. విద్యార్థుల సమగ్ర వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదికను అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద, నగర, రూరల్ ఎంఈఓలు, పాఠశాలల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఇందుకూరుపేట: మండలంలోని టీవీకండ్రిగ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల వివరాల మేరకు.. లేబూరు గిరిజన కాలనీకి చెందిన ఉప్పల మెల్లయ్య (40) ఆదివారం రాత్రి మోటార్‌సైకిల్‌పై కొమరికలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి బంధువులైన చంద్రశేఖర్, రమేష్‌తో కలిసి గంగపట్నం వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి వస్తూ మార్గం మధ్యలో టీవీకండ్రిగ వద్ద రోడ్డుపై ఉన్న గేదెను గమనించక ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో మెల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. చంద్రశేఖర్, రమేష్ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు. ఎస్సై వీరేంద్రబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ మోటార్ల చోరీ

వెంకటాచలం : మండలంలోని తిక్కవరప్పాడు గ్రామంలో పొలాల వద్ద ఏర్పాటు చేసుకున్న రెండు విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయి. తిక్కవరప్పాడుకు చెందిన కందిమళ్ల చంద్రమోహన్‌నాయుడు ఎప్పటిలానే తన పొలానికి సోమవారం వెళ్లగా, విద్యుత్ వైర్లు కత్తిరించి, పైపులు కట్‌చేసి విద్యుత్ మోటారు చోరీ చేసినట్లు గుర్తించారు. వీటి విలువ రూ.30 వేలు ఉంటుందని రైతు వాపోయాడు. అలాగే అదే ప్రాంతంలో నోసిన రంగయ్యతో పాటుగా మరో ముగ్గురికి చెందిన రూ.35 వేల విలువైన విద్యుత్ మోటారు చోరీకి గురైంది. ప్రతి సంవత్సరం విద్యుత్ మోటార్లు చోరీకి గురవుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ ప్రశంసనీయం



కొడవలూరు : క్రీడలతో పాటు వ్యాసరచన, వక్తృత్వ, పేపర్ మేకింగ్‌లోనూ గిరిజన గురుకులాల విద్యార్థులు చూపిన ప్రతిభ ప్రశంసనీయమని ఐటీడీఏ పీఓ రాణి మందా కొనియాడారు. మండలంలోని చంద్రశేఖరపురం గిరిజన గురుకులంలో ఐటీడీఏ పరిధిలోని ఐదు జిల్లాల గిరిజన కులాల విద్యార్థులకు సోమవారం లిటరసీ ఈవెంట్స్ నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన 42 మంది విద్యార్థులకు పీఓ బహుమతులందజేసి మాట్లాడారు. వైజాగ్‌లో జరిగే జాతీయ పోటీల్లోనూ ఇక్కడ విజేతలుగా నిలిచిన వారు విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఏఎంఓ శాంతకుమారి, గురుకులం ప్రిన్సిపల్ టి.విష్ణుప్రియ, కావలి ఏపీటీడబ్ల్యూ బాలబాలికల ప్రిన్సిపల్స్ శ్యామ్‌సుధాకర్, సుజాత, పీడీ వై.సత్యనారాయణలు పాల్గొన్నారు.

శైవక్షేత్రాల్లో కార్తీక శోభ



మూలపేటలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



నవాబుపేటలో విశేషాలంకారంలో మల్లేశ్వరస్వామి

నెల్లూరు(బందావనం): నగరంలోని శైవక్షేత్రాలు భక్తుల శివనామ స్మరణతో పులకించాయి. పవిత్ర కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. ఆదిదంపతులను దర్శించుకుని కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక దీప కాంతులతో ఆది దంపతుల కొలువులు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి విశేషపుష్పాలంకరణ, ప్రాకారోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం, రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మీనాక్షిదేవి సమేత సుందరేశ్వరస్వామి ఆలయం, సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వర స్వామి ఆలయం, మూలాపేట శంకరమఠంలోని కామాక్షీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయాల్లో విశేషాభిషేకాలు నిర్వహించారు. క్రాంతినగర్, కొండాబలరామిరెడ్డి వీధిలోని శివకేశవుల దేవస్థానం, ములుముడిబస్టాండ్ సమీపంలోని భ్రమరాంబ సమేత హరిహరనాథ ఆలయం, వేదాయపాళెంలోని కామాక్షీ సమేత మల్లికార్జునస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

• సింహపురి కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం వద్ద ఉన్న గణేశ్ ఘాట్‌లోని స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయం వద్ద దీపారాధనను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అనంతరం మహిళలు స్వర్ణాల చెరువులో అరటిదొనెలలో కార్తీక దీపాలను వదిలి పెట్టారు. ఈ సందర్భంగా సింహపురి కార్తీకదీపోత్సవ సమితి అధ్యక్షురాలు డాక్టర్ వెన్నెల మాట్లాడుతూ కార్తీకపౌర్ణమి సందర్భంగా ఆదివారం నిర్వహిస్తున్న కార్తీక మహాదీపోత్సవం కార్యక్రమం విజయవంతంగా జరగాలని స్వర్ణలింగేశ్వరస్వామిని వేడుకుంటూ దీపార్చన నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింహపురి కార్తీక దీపోత్సవ సమితి కార్యదర్శి బీ మల్లిక, కే జయప్రద, ఎం లక్ష్మి, ముక్కాల వ్యాస్ ప్రసాద్, ఏవీఆర్ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణాల చెరువులో కార్తీక దీపాలు వదులుతున్న సింహపురి కార్తీక దీపోత్సవ సమితి సభ్యులు



మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో కేదారేశ్వరస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు



గణేశ్ ఘాట్‌లోని స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలి



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ ఆదాల

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రాబోయే ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్‌సీపీని ఆదరించాలని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి కోరారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 20వ డివిజన్, స్నేహనగర్‌లో రూ.62 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు మేయర్ స్రవంతితో కలిసి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన చోట్ల నిధుల కేటాయింపు చేస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పార్టీలతో ప్రమేయం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అవినీతికి ఏ మాత్రం తావులేకుండా ప్రజల వద్దకే సేవలు అందుతున్నాయన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ పాటుపడుతానన్నారు. రూరల్ నియోజకవర్గంలో అరాచక పాలనను పూర్తిగా అణచివేస్తామన్నారు. ప్రతిఒక్కరూ ప్రశాంతంగా ఉండేలా మంచి వాతావరణం తీసుకొస్తామన్నారు. 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేశారని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ డైయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జులు రావు శ్రీనివాసరావు, సురేష్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



బాధితుల సమస్యలను వింటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి ప్రజలకు సూచించారు. నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 128 మంది హాజరై తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీకి అందజేశారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, వృద్ధులు, పిల్లలు, దివ్యాంగుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. స్నేహపూర్వకంగా తీసుకున్న వ్యక్తిగత సమాచారాన్ని, ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పెడతామని బెదిరించి నగదు, బంగారం కాజేసే వ్యక్తులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. యూపీఐ, బార్ కోడ్ స్కానర్, ఏఈపీఎస్, క్రెడిట్ కార్డు, తదితర సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దొంగతనం, దోపిడీ కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని బాధితులకు అందేలా చూడాలన్నారు. ఆస్తి పరమైన అంశాల్లో న్యాయపరమైన విచారణ జరిపి చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన వినతుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం స్పందనకు వచ్చిన వారికి భోజనం అందజేశారు. ఏఎస్పీ డీ హిమవతి, ఎస్సీ, ఎస్టీ సెల్-2 డీఎస్పీ శ్రీనివాసరావు, ట్రెయినీ డీఎస్పీ ఎం హేమలత, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు కే రామకృష్ణారెడ్డి, షఫీ, ఆర్ఐలు అంకమరావు, మౌలుద్దీన్, కంప్లెయింట్ సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ శర్మద

నెల్లూరు(బారకాసు): 'సందన' అర్జీలను వెంటనే పరిష్కరించాలని అదనపు కమిషనర్ శర్మద అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఏపీజేఅబ్దుల్ కలాం సమావేశ మందిరంలో 'స్పందన' కార్యక్రమం జరిగింది. నగర ప్రజలు వివిధ సమస్యలపై 24 అర్జీలను అదనపు కమిషనర్‌కు అందజేశారు. ఇంజినీరింగ్ 10, సిటీ ప్లానింగ్ 6, శానిటేషన్ 4, సచివాలయం 1, ఆప్కాస్ 1, హౌసింగ్ విభాగం 2 చొప్పున అర్జీలు అందాయి. అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో అదనపు కమిషనర్ సమీక్షించారు. ప్రజల నుంచి అందే ప్రతి అర్జీకి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపించాలన్నారు. స్పందన సమస్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఎస్ఈ సంపత్‌కుమార్, మేనేజర్ ఇనయుతుల్లా, ఎంహెచ్ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ



నెల్లూరు (టౌన్): పొదలకూరురోడ్డులోని వియానీ హోమ్‌లోని పేద విద్యార్థులకు రత్నం ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు సోమవారం నిత్యావసర సరుకులు వితరణ చేశారు. సామాజిక సేవలో భాగంగా నిత్యావసర సరుకులను అందజేశారు. పాఠశాల ప్రిన్సిపల్ కళ్యాణి, మేనేజర్ రాజేష్‌బాబు, కోఆర్డినేటర్లు సమీర, ఎలిజబెత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

నెల్లూరు (టౌన్): పొదలకూరురోడ్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీపీసీ ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి వాణి ముఖ్యఅతిథిగా హాజరై రాజ్యాంగంలో బాలలకు కల్పించిన హక్కులు, హక్కుల ఒడంబడికలు, అంతర్జాతీయ బాలల దినోత్సవం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. డీఎస్పీ హేమలత గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్‌పై బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, దిశ సీఐ రామారావు, ఎంఈఓ మురళీధర్, ఎన్జీఓ శ్రీనివాసులు, హెడ్‌మాస్టర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



వెంకురెడ్డి (ఫైల్)

నెల్లూరు సిటీ: నగరంలోని మూలాపేట, చాముండివారితోటలో నివాసం ఉంటున్న మెట్టుకూరు వెంకురెడ్డి(77) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన నేత్రాల(కార్నియా)ను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ బీ లాలేష్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నేత్ర వైద్యుడు షెఫాలి కార్నియాలను సేకరించారు. కుటుంబ సభ్యులకు నేత్రదానం సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. నేత్రదానం చేయదలచిన వారు లాలేష్ 99481 64781, బాలాజీ 93471 11033 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద

నెల్లూరు(బారకాసు): గ్రంథాలయ సేవలను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద పిలుపునిచ్చారు. నగరంలోని రేబాలవారివీధిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యువతకు పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్‌ను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి రాచపాళెం రఘు తాను రచించిన కవితల పుస్తకాలను గ్రంథాలయానికి చైర్‌పర్సన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షుడు సతీష్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కే కుమార్‌రాజా, గ్రంథాలయాధికారి సీహెచ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



నెల్లూరు(బృందావనం): భక్తవత్సలనగర్, ఎన్జీఓ కాలనీలోని శ్రీకృష్ణమందిరం ప్రాంగణంలో శ్రీపరంజ్యోతి అమ్మభగవాన్ సేవా సమితి ఆధ్వర్యంలో నారాయణ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సేవా సమితికి చెందిన సౌజన్యదాసాజీ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. భక్తవత్సలనగర్, ఎన్జీఓ కాలనీ పరిసర ప్రాంతాల ప్రజలకు నారాయణ ఆస్పత్రి వైద్యులు వైద్య సేవలు అందించారు. అమ్మభగవాన్ సేవా సమితి సభ్యులు ఆనంగి వెంకటరమణయ్య, సుధాకర్, భారతి, కిషోర్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కేంద్ర కఠిన నిర్ణయాలతో మనుగడ కష్టతరం



సహకార ప్రతిజ్ఞ చేస్తున్న బ్యాంకు సిబ్బంది

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కేంద్ర ప్రభుత్వ కఠిన నిర్ణయాలతో నేడు దేశంలోని సహకార బ్యాంకుల మనుగడ కష్టతరంగా మారిందని ది నెల్లూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ చైర్మన్ అరిగెల నాగేంద్రసాయి అన్నారు. 70వ అఖిల భారత సహకార వారోత్సవాల ముగింపు సందర్భంగా నగరంలోని ది కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌లో 'సహకార విద్య-శిక్షణ పునరుద్ధరణ' అనే అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన నాగేంద్రసాయి మాట్లాడుతూ సహకార సంఘాల అభివృద్ధికి సహకార శాఖ కృషి చేస్తోందన్నారు. లాభాలను ఆర్జించడమే లక్ష్యంగా కాకుండా పలువురికి సహకారం అందించడం కోసమే సహకార బ్యాంకులు, సహకార సంఘాలు పని చేస్తాయన్నారు. వచ్చిన లాభాలను సభ్యులకు పంచడం, నిజాయతీగా, నిబద్ధతగా పనిచేయడం ద్వారా ప్రజల్లో సహకార వ్యవస్థపై నమ్మకం ఏర్పడిందన్నారు. నేడు కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల సంఖ్యను తగ్గించటం, రుణాల మంజూరులో విధించిన కఠిన నిబంధనలతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఈ విషయాన్ని కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళతామన్నారు. అనంతరం జిల్లా సహకారశాఖ ఆడిట్ అధికారి తిరుపతయ్య, సహకార శాఖ విద్యాధికారి గోగుల శ్రీనివాసులు సహకార ఉద్యమం, సహకార వ్యవస్థ ఆవశ్యకతపై ప్రసంగించారు. అనంతరం సహకార ప్రతిజ్ఞ చేశారు. తొలుత సహకార జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీసీఓ అనిత, మేనేజర్ షఫీ, సిబ్బంది, బ్యాంకు పాలకవర్గ సభ్యులు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో పది నెలల జైలు

నెల్లూరు (లీగల్) : అప్పు తీసుకుని తిరిగి చెల్లించే క్రమంలో చెల్లని చెక్కు ఇచ్చాడనే కేసులో నేరం రుజువు కావడంతో నగరంలోని మూలాపేట కొండదిబ్బ ప్రాంతానికి చెందిన గొలగాని సుధాకర్‌కు పది నెలల జైలు శిక్షతో పాటు రూ.10 లక్షలను పరిహారంగా ఫిర్యాదుదారుడికి చెల్లించాలని నెల్లూరు ఐదో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ జి.దేవిక సోమవారం తీర్పుచెప్పారు. వివరాలు..మూలాపేటలోని తిరుస్‌పేట ప్రాంతానికి చెందిన మునగాల వెంకటరమణయ్య వద్ద నుంచి గొలగాని సుధాకర్ తన అవసరం నిమిత్తం 12.12.2016వ తేదీన రూ.7 లక్షలు అప్పుగా తీసుకుని ప్రామిసరి నోటు రాసి ఇచ్చాడు. ఈ మొత్తాన్ని చెల్లించే క్రమంలో నిందితుడు నెల్లూరు ఎస్బీఐ పేరిట 30.08.2017న రూ.7 లక్షల చెక్కు ఇచ్చాడు. ఫిర్యాదుదారుడు 7.09.2017న నెల్లూరులోని ఐసీఐసీఐ బ్యాంకులోని తన ఖాతాలో చెక్కు జమ చేయగా ఖాతాలో నగదు లేని కారణంగా బౌన్స్ అయి తిరిగి వచ్చింది. దీంతో ఫిర్యాదుదారుడు 19.09.2017న లాయర్ ద్వారా నోటీసు పంపి కోర్టులో కేసు దాఖలు చేశారు. కేసు విచారణ సమయంలో ఫిర్యాది మృతి చెందడంతో అతని వారసులు కేసును కొనసాగించారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైమేరకు తీర్పు చెప్పారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

• జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు రూరల్: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. రూరల్ మండలం సౌత్‌మోపూరులో సోమవారం నిర్వహించిన 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధితో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించాలని సూచించారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఎంపీపీ విజయకుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాంప్రసాద్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, స్థానిక నాయకులు, మండలాధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర దీపారాధన



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో కార్తీక సోమవారం సందర్భంగా సహస్రదీపారాధనను వైభవంగా నిర్వహించారు. మండల పూజల్లో భాగంగా అయ్యప్పస్వామి విశేషాభిషేకాలు, పూజలు,సేవలు, ఉత్సవాలు విశేషంగా నిర్వహించారు. విశేషాలంకారంలో కొలువైన అయ్యప్పస్వామిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఉభయకర్తలుగా చెరుకుపల్లి పద్మనాభరెడ్డి, వెందోడు పరంధామరెడ్డి, కిలారి శ్రీనివాసులునాయుడు, సంతోష్‌కుమార్‌రెడ్డి, సుబ్బరామరెడ్డి, జీవీ సంతోష్‌కుమార్‌రెడ్డి, అడపాల శ్రీనివాసులురెడ్డి, చంద్రశేఖరరెడ్డి, బెల్లంకొండ కిరణ్‌రాజ్ దంపతులు వ్యవహరించారు.